సాక్షి
పల్నాడు
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024




గండాలయస్వామికి పూజలు

మంగళగిరి: పట్టణంలోని కొండపై వేంచేసి ఉన్న గండాలయస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శుక్రవారం అమావాస్య కావడంతో అధిక సంఖ్యలో విచ్చేశారు.



యార్డులో 1,23,756 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,23,756 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,077బస్తాల అమ్మకాలుజరిగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు

పెదకాకాని: రాష్ట్రస్థాయి దీనీ ఇజ్‌తిమా ప్రార్థనలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు డాంగేనగర్ సమీపంలోని విశాల స్థలంలో రెండు రోజుల పాటు దీనీ ఇజ్‌తిమా నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను మంగళగిరి డీఎస్పీ సీహెచ్.రవికాంత్ శుక్రవారం పరిశీలించారు. మత పెద్దలతో చర్చించారు. డీఎస్పీ వెంట పెదకాకాని సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ముద్దాయిలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సత్తెనపల్లి: ముద్దాయిలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, గుంటూరు సీనియర్ సివిల్ జడ్జి లీలావతి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మీతో కలిసి శుక్రవారం సందర్శించారు. అక్కడ ఉన్న పరిసరాలను పరిశీలించారు. ముద్దాయిల వివరాలను తెలుసుకున్నారు. ఎవరైనా బాల నేరస్తులు ఉన్నారా అని కూడా ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.డి.గౌస్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

108లో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : 108 అంబులెన్సుల్లో డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ నాగదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంగ్లీషు చదవడం, రాయడం తెలిసి ఉండి, డ్రైవింగ్ హెవీలైసెన్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు ప్రాంతాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం రెండో అంతస్తులోని 108 కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరులో సంప్రదించాలని కోరారు.

గణాంక వ్యవస్థపై క్విజ్ పోటీలు



గుంటూరుఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు గణాంక వ్యవస్థపై క్విజ్ పోటీలను నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్‌కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప ప్రాంతీయ కార్యాలయ గణాంక అధికారి డి.హనుమంతరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గణాంక వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం 'అధికారిక గణాంకాల వ్యవస్థ–ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు' అనే అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా కళాశాల, అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాల, టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో గణాంక శాఖ సహాయ డైరెక్టర్ శామ్యూల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

12న ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శన

గుంటూరుఎడ్యుకేషన్ : 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మానక్ ప్రదర్శనను ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన 112 ప్రాజెక్టులను గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శనకు తీసురావాలని సూచించారు. ప్రదర్శనకు ఢిల్లీ నుంచి పరిశీలకులు వస్తున్నారని, సంబంధిత విద్యార్థులు ఏ కారణంతోనూ గైర్హాజరు కారాదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ.రవికుమార్‌ను 98496 27708 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మదర్ పీహెచ్‌సీకి మహర్దశ



గాదెవారిపల్లెలో ఆధునీకరించిన మదర్ పీహెచ్‌సీ భవన సముదాయం

- టీడీపీ హయాంలో గ్రహణం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాకతో మారిన దశ
- రూ.1.20 కోట్లతో అత్యాధునిక భవనం నిర్మాణం
- 24 గంటల ఆస్పత్రిగా మార్పు
- పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం
- 11 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు



నాటి శిథిల భవనం



కారెంపూడి: మారుమూల పల్లెలో ఉన్న గాదెవారి పల్లె పీహెచ్‌సీ ఒకప్పుడు పల్నాడులో మదర్ పీహెచ్‌సీగా పేరొందింది. అలాంటి పెద్ద పీహెచ్‌సీకి టీడీపీ ప్రభుత్వంలో సమస్యల జ్వరం మొచ్చి అల్లాడిపోయింది. దాదాపు రెండు దశాబ్దాలుగా అక్కడ వైద్య సేవలు కొండెక్కాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆసుపత్రికి పూర్వ వైభవం వచ్చింది. అధునాతన భవనం నిర్మించారు. సిబ్బందిని నియమించారు. ఇప్పుడు 24 గంటలు ప్రజలకు వైద్య సేవలందిస్తోంది.

నాడు: 1961లో పీహెచ్‌సీ ప్రారంభమైంది. సుమారు ఆరు ఎకరాలలో డాక్టర్లు, స్టాఫ్ క్వార్టర్లతో పాటు పీహెచ్‌సీ ఒక వెలుగు వెలిగింది. దాదాపు పల్నాడు ప్రజలందరికి ఇది దిక్కుగా ఉండేది. అలాంటి పీహెచ్‌సీకి 2001 నుంచి గ్రహణం పట్టింది. దాదాపు వైద్య సేవలు పడకేశాయి. ఒక డాక్టరుండేవారు ఆయన కూడా ఎప్పుడూ డిప్యూటేషన్‌లో ఉండేవారు. ఫార్మసిస్ట్, స్టాఫ్‌నర్స్ మాత్రమే ఉండేవారు. వారు ఏదో నామ మాత్రపు వైద్య సేవలందించేవారు. దాదాపు ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఏదైనా అనారోగ్య సమస్యతో ప్రజలు అల్లాడిన సందర్భాలలో గ్రామస్తులకు కోపం వచ్చి వైద్య సిబ్బందిని గదిలో పెట్టి తాళం కూడా వేసేవారు. అయినా నాటి ప్రభుత్వాల చెవికెక్కలేదు. దాదాపు 2019 వరకు ఇదే పరిస్థితి.

నేడు: కానీ నేడు రూ.1.20 కోట్లతో అత్యాధునిక భవనం నిర్మించారు. ఇద్దరు రెగ్యులర్ డాక్టర్లు, 14 మంది పూర్తిస్థాయి స్టాఫ్. అందుబాటులో అన్ని రకాల మందులు. 24 గంటల ఆసుపత్రిగా మారిన తీరు ముచ్చట గొలుపుతోంది. దీంతోపాటు పీహెచ్‌సీ పరిధిలోని గోగులపాడు, చింతపల్లి, పేటసన్నెగండ్ల, చినకొదమగుండ్ల గ్రామాలలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. 20 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పీహెచ్‌సీకి మహర్దశ వచ్చింది. ఇప్పుడు 11 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఆనాటి కళ నేడు మళ్లీ వచ్చింది..



నేను 1995లో పీహెచ్‌సీలో ఉద్యోగం చేశాను. 1964 నుంచి దాదాపు 2000 సంవత్సరం వరకు పీహెచ్‌సీ బాగుంది. ఆ తర్వాత నుంచి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. మళ్లీ నాలుగేళ్లుగా డాక్టర్లు, పూర్తిస్థాయి స్టాఫ్‌తో ఆసుపత్రి కళకళలాడుతోంది. ఇది చూసి గ్రామస్తునిగా సంతోషపడుతున్నా.

– మల్లా మస్తాన్, గాదెవారిపల్లె

టెన్షన్ లేదు..



గతంలో డాక్టర్ లేక ఇబ్బంది పడేవారం. ఇప్పుడు ఆసుపత్రికి ఎప్పుడు వెళ్లినా తీసే ఉంటోంది. నాకు బీపీ, కాళ్ల నొప్పులున్నాయి. మాత్రలు అయిపోగానే ఎప్పుడంటే అప్పుడు తెచ్చుకోడానికి వీలుగా ఉంది. బీపీ కూడా టెన్షన్ లేకుండా చెక్ చేయించుకుంటున్నా.

– భూపతి నాగేశ్వరరావు, గాదెవారిపల్లె

పట్టణం వెళ్లాల్సిన బాధ తప్పింది..



నా వయస్సు 74 ఏళ్లు. బీపీ, షుగర్ వచ్చాయి. గతంలో పట్టణం వెళ్లి ప్రతి నెలా మందులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రామంలోనే ఉచితంగా దొరకుతున్నాయి. ఈ మందులు వాడితేనే బాగుందనిపిస్తోంది. 104 బండి వాళ్లు కూడా మందులు ఇస్తున్నారు.

– బైరెడ్డి ముత్తారెడ్డి, గాదెవారిపల్లె

15న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత, ఎస్పీ తుషార్ డూడీ

సభాస్థలిని పరిశీలించిన తలశిల రఘురామ్

ఫిరంగిపురం: ఫిరంగిపురంలో ఈనెల 15న నిర్వహించ తలపెట్టిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డిలు రేపూడి గ్రామ శివారులోని పీఏన్‌సీ కళాశాల సమీపంలోని పొలాలను పరిశీలించారు, హెలీప్యాడ్ కోసం మార్నింగ్ స్టార్ కళాశాల స్టేడియంను, ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు, సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను వారు పరిశీలించారు, ఆయాప్రదేశాలలో చేపట్టవలసిన భద్రతా చర్యలపై జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఆర్డీవో పి.శేఖర్, ఆర్అండ్‌బీ అధికారులతో చర్చించారు, వారివెంట ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మనందరెడ్డి, జేసీ రాజకుమారి, జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలాన రీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొండవీడు ఉత్సవాలకు సర్వం సిద్ధం

హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు



హెలికాప్టర్ వద్ద కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: చారిత్రక, పర్యాటక కేంద్రం కొండవీడు ఫెస్ట్ –2024కు సర్వం సిద్ధమైంది. కోటపై ఏర్పాట్లను వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పుట్టకోట(కొత్తపాలెం) గ్రామం ప్రారంభంలోనే ఏడు ఎకరాల్లో పారా మోటరింగ్, హాట్ ఎయిర్ బెలూన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అన వేమారెడ్డి విగ్రహం పక్కనే కొండవీడుకోటలో సందర్శించదగ్గ ప్రదేశాలు, మ్యాప్ బోర్డు గ్యాలరీ ఉంది. వాటి ఎదురుగానే ఫ్లవర్‌షో, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, దేశనాయకులు, అంబేడ్కర్ జీవిత విశేషాలు, స్వాతంత్ర్య పోరాట ఘట్టాల గ్యాలరీ సిద్ధం చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన ఎయిర్ బస్(హెలికాప్టర్)తో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అధికారులతో ట్రయల్ రన్ నిర్వహించారు. 30 కి.మీ మేర కొండవీడు కోట, ఫిరంగిపురం, అమీనాబాద్ ప్రాంతాల మీదుగా చక్కర్లు కొట్టడం జరుగుతుందన్నారు.

అత్యవసర కాల్స్‌కు వెంటనే స్పందించాలి

- పోలీసులకు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సూచన
- జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం



సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: దిశ కాల్స్, 112, 100 ఎమర్జెన్సీ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అత్యవసర కాల్స్ పట్ల నిర్లక్ష్యం వహించకుండా వెనువెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలన్నారు. కాల్ వచ్చిన సమయం, సంఘటనా స్థలానికి చేరుకున్న సమయాన్ని పరిగణలోకి తీసుకొని నిర్లక్ష్యంగా స్పందించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జగనన్నకు చెబుదాంకు వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, పోర్టల్‌లో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండే విధంగా సదస్సులు ఏర్పాటు చేయాలని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని కట్టడి చేస్తే నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. రౌడీలు, అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో తీసుకుంటున్న పటిష్ట చర్యల వలన గంజాయి అక్రమ రవాణాను నిరోధించగలిగామన్నారు. నాటుసారా తయారీ, క్రయ, విక్రయాలుపై నిఘా పెట్టి వాటిని అరికట్టాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి వేగవంతంగా దర్యాప్తు చేసి సంబంధిత కోర్టులో ఛార్జిషీట్ వేయాలన్నారు. కోర్టులో విచారణ సక్రమంగా జరిగేలా డీఎస్పీ, సీఐ, ఎస్‌హెచ్‌వోలు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. సాక్షులు నిర్భయంగా న్యాయమూర్తి ఎదుట సాక్ష్యం చెప్పేవిధంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. నిందితుడికి కోర్టు శిక్ష విధించినప్పుడే మనం బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా నుంచి బదిలీ అయిన నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కెవీ మహేష్, బి.ఆదినారాయణ, దిశా డీఎస్పీ యు.రవిచంద్ర, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు భక్తవత్సలరెడ్డి, సీతారామయ్య, కృష్ణయ్య, షమీముల్లాను సన్మానించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్ రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి రామచంద్రరాజు, డీఎస్పీలు జీసీ గురునాథ్‌బాబు, పల్లపు రాజు, షేక్ ఫర్ర్యూద్దీన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర ఇస్తున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నరసరావుపేటఈస్ట్: పాఠశాల స్థాయి విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ పట్ల తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాలలో విద్యార్థులకు అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆమె మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సులోపు పిల్లలు ఆల్బెండజోల్ టాబ్లెట్ నమిలి మింగి నులిపురుగుల నివారణకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణ రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5000, గరిష్ఠ ధర రూ.6200, మోడల్ ధర రూ.5600 వరకు పలికింది.

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్
- ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు
- జిల్లాలో 10,495మంది సైన్స్ విద్యార్థులు
- రేపటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహణ



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి నీలావతిదేవి


నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు నిర్వహించాలని ఇంటర్మీడియేట్ బోర్డు నిర్ణయించింది. అందుకు తగిన విధంగా పల్నాడు జిల్లా ఇంటర్మీడియేట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభం కాగా, ఆదివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 76 కేంద్రాలలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో 10,495మంది సైన్స్ విద్యార్థులు హాజరు కానుండగా వారిలో 1929మంది బైపీసీ విద్యార్థులు, 8,566 మంది ఎంపీసీ విద్యార్థులు ఉన్నా రు. 450మంది విద్యార్థులు దాటిన కేంద్రాలలో రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరపనున్నారు. ప్రయోగ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో మార్కులను ఓఎంఆర్ షీట్‌పై నమోదు చేయగా ఈఏడాది నుంచి ప్రయోగ పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఒకసారి మార్కులను అప్‌లోడ్ చేసిన తరువాత ఎట్టి పరిస్థితులలోనూ మార్పులు చేసేందుకు వీలులేకుండా సైట్ రూపొందించారు. మార్కుల నమోదు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌లను ఆదేశించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియేట్ ప్రయోగ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి ఎం.నీలావతిదేవి, పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తెలిపారు. కెఆర్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం ప్రయోగ పరీక్ష కేంద్రాల సీఎస్, డీఓలు, ఎగ్జామినర్లకు అవగాహన తరగతులు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ, ఆన్‌లైన్‌లో మార్కుల నమోదుపై అవగాహన కల్పించారు.

ఫిట్స్‌కు ఆధునిక వైద్యం

- 12న ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డే
- మూర్ఛ బారిన పడుతున్న యువత
- అవగాహన లేక అవస్థలు



గుంటూరు మెడికల్: ఫిట్స్ వ్యాధికి వైద్యం లేదనే అపోహ చాలా మందిలో ఉంది. ఎపిలెప్సీని(ఫిట్స్)ను పూర్తిగా తగ్గించే ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నా అవగాహన లేక పలువురు అవస్థలు పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 65మిలియన్ల ప్రజలు మూర్ఛవ్యాధి(ఎపిలెప్సీ)తో బాధపడుతున్నారు. వీరిలో 80శాతం బాధితులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఉన్నారు. వెయ్యి మందిలో నాలుగు నుంచి పది మంది తమ జీవితకాలంలో ఒక్కసారైనా ఫిట్స్ బారిన పడుతున్నారు. ప్రజలకు ఫిట్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు 2005 నుంచి ఫిబ్రవరి నెలలో రెండో సోమవారంను ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మూర్ఛ అనగా (ఫిట్స్) ...

మెదడులో ఉన్న న్యూరాన్‌లు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ లేదా మూర్ఛ అంటారు. ఇది వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. ఫిట్స్ వచ్చినప్పుడు కొంత మందికి నాలుక కొరుక్కోవడం, నోటి నుంచి నురగ కారడం గమనించవచ్చు. ఫిట్స్ ఎక్కువ సమయం ఉండే మనిషి దేహం నీలంరంగుగా మారి ప్రాణాపాయస్థితికి చేరుకోవచ్చు.


కారణాలు...

మెదడులో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, మెదడులో రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల ఫిట్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో, పెద్దవారిలో అందరిలోనూ ఈ మూర్ఛ వ్యాధి వస్తుంది. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో వచ్చే అవకాశం ఉంది. స్త్రీలు ప్రసవ సమయంలో కొన్ని రకాల చికిత్స విధానాలు పాటించకపోవడం వల్ల, టీబీ, హెచ్ఐవీ, మెదడువాపు జబ్బుల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల ఫిట్స్ కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ

గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం మూర్ఛ వ్యాధి బాధితుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటుచేశారు. ప్రతి వారం 300 మంది ఓపీ విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో సుమారు 50 న్యూరాలజీ క్లినిక్‌లు, ఫిజీషియన్ల వద్ద ప్రతి రోజూ 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో 20 శాతం మంది యువకులే ఉండటం గమనార్హం.

జాగ్రత్తలు తీసుకోవాలి



మూర్ఛకు గురైన వ్యక్తిని నేలపై పడిపోకుండా పట్టుకోవాలి. వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి తలకు దెబ్బతగలకుండా కాపాడాలి. బెల్టు, మెడకున్న టై లేక ఏమైనా బిగుతుగా ఉన్న బట్టలను వదులు చేసి, ప్రశాంతంగా ఉండేలా చూడాలి. పూర్తిగా స్పృహలోకి వచ్చేవరకూ వారితోనే ఉండాలి.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్.


డ్రైవింగ్ చేయకూడదు..



ఫిట్స్ వచ్చినప్పుడు రోగి చేతిలో తాళాలు పెట్టటం, నోట్లో నీళ్ల పోయటం, గిల్లటం, కాల్చటం లాంటి పనులు చేయకూడదు. ఫిట్స్ రెండు నుంచి మూడు నిమిషాలపాటు ఉండి అవే తగ్గిపోతాయి. అంతకుమించి ఎక్కువసేపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి ఉన్న వారు స్విమ్మింగ్, డ్రైవింగ్ చేయకూడదు.

–డాక్టర్ చక్కా శివరామకృష్ణ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

ఆపరేషన్‌తో నయంచేయవచ్చు...



మూర్ఛవ్యాధిని తగ్గించేందుకు మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. 30శాతం మందికి ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గదు. వారికి ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్ వల్ల నూటికి 95 శాతం ఫిట్స్ తిరిగి రావు. ఆపరేషన్ తర్వాత ఏడాదిన్నర నుంచి రెండేళ్లు మందులు వాడితే చాలు.

–డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్, న్యూరో సర్జన్, గుంటూరు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- ఎస్పీ రవిశంకర్ రెడ్డి
- హెల్మెట్ ఆవశ్యకతపై ద్విచక్ర వాహన ర్యాలీకి పచ్చజెండా



ద్విచక్రవాహన ర్యాలీలో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది లేకుండా వాహనాన్ని నడిపి ప్రమాదాలు సంభవిస్తే వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పల్నాడు రోడ్డులోని ద్విచక్రవాహనాల షోరూం దగ్గర నుంచి ప్రారంభమైన హెల్మెట్ ధారణ, ఆవశ్యకతలపై అవగాహన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అదే ర్యాలీలో తాను కూడా హెల్మెట్ ధరించి బైకు నడిపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ఏడాదికి వందల మంది మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం వలన అది మనకు ఒక రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. మైనర్ పిల్లలకి వాహనాలు ఇవ్వొద్దని, వాటిని ఏ విధంగా ఎంత వేగంతో నడపాలో తెలీక వారు ప్రమాదాలకు గురవ్వడమే కాకుండా ఎదుటివారికి కూడా ప్రమాదం తెచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. విద్యార్థులు హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై తప్పకుండా అవగాహన కలిగి వుండి, వారి తల్లిదండ్రులకు, చుట్టుప్రక్కల వారికి తెలియపరచవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి రామచంద్ర రాజు, డీఎస్పీలు కేవీ.మహేష్, బి.ఆదినారాయణ, జీసీ గురునాథ్ బాబు, పల్లపురాజు, షేక్.షర్ఫుద్దీన్, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర, ఏఆర్ డీఎస్పీ బి చిన్నికృష్ణ, జిల్లా రవాణ శాఖ అధికారి టీకే పరంధామరెడ్డి, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రావ్య, ఆర్ఐలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్, రవాణాశాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా తుది దశ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాల జట్లు

విశాఖ స్పోర్ట్స్: గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికైంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం విశాఖ రైల్వే స్టేడియంలో ప్రారంభించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన జట్ల చేత క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. తొలిరోజు బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన హాశిత-రమ్య జోడీ 21-09, 21-11తో సత్యప్రియ-రోహిత జోడీపై విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ భక్తులు, (ఇన్‌సెట్‌) మేరీమాత విగ్రహం

వందనం

ఘనంగా గుణదల మేరీమాత తిరునాళ్ల ప్రారంభం

జననీ లోకమాతా వందనం.. దయచూపే మా తల్లీ ధన్యులమయ్యామంటూ క్రైస్తవ భక్త లోకం కీర్తించింది. లోక రక్షకుడికి జన్మనిచ్చిన ఆ తల్లి పవిత్రతకు, పరిశుద్ధతకు సమమైనది ఏదీ లేదని చాటి చెబుతూ.. ప్రశస్తమైన ఆ నిష్కళంకమాత ఒడిలో సాంత్వన పొందేందుకు పోటీ పడింది. శుక్రవారం గుణదల మేరీమాత తిరునాళ్ల వైభవంగా ప్రారంభమైంది. ఉదయం, సాయంత్ర వేళల్లో గురువుల సమష్టి దివ్య పూజాబలి.. భక్తుల ప్రార్థనలు, మొక్కుబడుల స్తుతి ధూపం శిఖరాగ్రానికి చేరింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన యాత్రికులను ఉత్సాహపరిచే పాటలు, నాటికలు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని కల్గించాయి.



మేరీమాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న బిషప్ రాజారావు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న యువతులు

గుణదల (విజయవాడ తూర్పు): క్రైస్తవ ఆధ్యాత్మిక శిఖరం గుణదల పుణ్యక్షేత్రంలో మేరీమాత శతాబ్ది మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రధానాలయం దిగువన ఉన్న బిషప్‌గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై విజయవాడ మేత్రాసన గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ఆరంభించారు. పుణ్యక్షేత్ర గురువులు, మఠకన్యలు, వేలాది మంది భక్తుల సమక్షంలో తొలి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ, భారత దేశంలో అతి పెద్ద రెండో క్రైస్తవ క్షేత్రంగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోందన్నారు. మరియమాతను ఆశ్రయించిన భక్తుల జీవితాలు శాంతి సమాధానాలతో ఉంటాయని తెలిపారు. కుల మతాలకు అతీతంగా మరియమాత అందరినీ అక్కున చేర్చుకుంటుందని పేర్కొన్నారు. ఫ్రాన్సు దేశంలో లూర్ధుమాతగా దర్శనమిచ్చిన మరియతల్లి లోకమాతగా భక్తుల నీరాజనాలు అందుకుంటోందని చెప్పారు. లోక రక్షకుడైన క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడుచుకోవాలన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం స్థాపించి నూరు వసంతాలు పూర్తవటం ఆనందదాయకమన్నారు. మరియతల్లి దీవెనలతో ఈ ఏడాది శతాబ్ది ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. లక్షలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరై మరియమాతను దర్శించుకుని ఆమె దీవెనలు పొందాలని ఆశీర్వదించారు. అనంతరం డయాసిస్ మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ సునీల్‌రాజు, తదితర గురువులతో కలసి సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. ఇదే వేదికపై జుబిలేరియన్ గురువులను ఘనంగా సత్కరించారు.

శతాబ్ది సందడి..

గుణదల ఉత్సవాల తొలిరోజైన శుక్రవారం మేరీమాత పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఈ ఏడాది పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు లక్షలాదిగా తరలివస్తున్నారు. కొండపై మరియమాతను దర్శించుకుని భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. శిఖరాగ్రం వరకు వెళ్లి క్రీస్తు శిలువ వద్ద ప్రార్థనలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం పుణ్యక్షేత్ర గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు పలికారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బిషప్ గ్రాసీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటయిన వేదికపై కళాకారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలతో భక్తులు తన్మయం చెందుతున్నారు. సంసోను దెలీలా, లాజరు జీవిత విశేషాలను వివరిస్తూ చేసిన నృత్య రూపకాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పటిష్ట బందోబస్తు



విజయవాడస్పోర్ట్స్: గుణదల మేరీ మాత తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. మేరీమాత తిరునాళ్లను సీపీ రాణా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తేదీ వరకు జరిగే తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. 1,500 మంది లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తు విధులు కేటాయించామన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడంతో పాటు రద్దీని నివారించేందుకు ప్రత్యేకంగా మూవింగ్‌పార్టీలను నియమించామన్నారు. సీపీ వెంట డీసీపీలు కృష్ణకాంత్‌పాటిల్, కె.శ్రీనివాసరావు, ఏసీపీ భాస్కరరావు ఉన్నారు.



గోల్డెన్, సిల్వర్ జుబిలేరియన్స్‌ను సత్కరిస్తున్న బిషప్ రాజారావు

అక్క చెల్లెమ్మలు మమ్మల్ని దీవించాలి

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- 1450 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : అక్క చెల్లెమ్మలు మమ్మల్ని దీవించి మరోసారి అసెంబ్లీకి పంపించాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి కోరారు. నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో 1450 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే కాసు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తనను, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దీవించారని, మీ అమూల్యమైన ఓటు ఫ్యాన్ గుర్తుకి వేసి అసెంబ్లీకి పంపించారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించానని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడ్డామని ఆయన చెప్పారు. అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, సున్నావడ్డీ, జగనన్న తోడు తదితర కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మహిళల స్వశక్తితో పాటుగా ప్రభుత్వ తోడ్పాటు అందించటం వల్ల పురుషులతో సమానంగా రాణించారని ఆయన తెలిపారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ఒక్క పట్టా కూడా ఇవ్వలేదని తాము అధికారంలోకి వచ్చిన తరువాత నగర పంచాయతీ పరిధిలో ఇప్పటికే అర్హులైన నిరుపేదలను గుర్తించి 4700లకు పైగా ఇంటి పట్టాలను ఇచ్చామని, పక్కా గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. రెండు నెలల్లో ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని, జగనన్న కాలనీని రూ.7 కోట్లతో మౌలిక వసతుల కల్పన పనులు చేస్తామని తెలిపారు. నగర పంచాయతీలో రూ.16.50 కోట్లతో శుద్ధి చేసిన కృష్ణా జలాలను మీ ఇంట్లోకి వచ్చేటట్లు పనులు చేస్తామని, సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు మీ ఇళ్లకే వస్తున్నాయని ఎమ్మెల్యే కాసు చెప్పారు. నవరత్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, డ్వాక్రా మహిళలకు టీడీపీ ప్రభుత్వంలో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్కొక్క గ్రూప్‌కి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఇంకా మిగిలిన నిరుపేదలు ఎవరైనా ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి మళ్లీ ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీలు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్ కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్ రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, మార్కెట్ యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, శ్రీరాంపోలు, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, దేవళ్ల ప్రసన్న లక్ష్మి, నాయకులు మునగా శ్రీనివాసరావు, షేక్ డాడీ, కొమ్ము బుజ్జి, దాచేపల్లి సైదారావు పాల్గొన్నారు.

అసరా అందించి... బాసటగా నిలిచి

పిడుగురాళ్లరూరల్: ప్రతి మహిళలకు ఆసరాగా నిలుస్తూ ప్రతి కుటుంబానికి నేను ఉన్నానని భరోసా కల్పిస్తున్న సీఎం ఎవరైనా ఉన్నారంటే అది వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనేనని శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరాలపాడు, తుమ్మలచెరువు గ్రామంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కరాలపాడు గ్రామంలో 82 గ్రూపుల్లో 819 సభ్యులకు 1, 16, 00, 225 నాలుగు విడతల్లో రుణమాఫీ అయిందని, తుమ్మలచెరువు గ్రామంలో 80 గ్రూపుల్లో 786 మంది సభ్యులకు రూ. 1, 41, 32, 685 నాలుగు విడతల్లో పూర్తిగా రుణమాఫీ చేశారన్నారు. అనంతరం డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు చెక్కులను అందజేశారు.

అభివృద్ధి కాగితాలపై కాదు!

పిడుగురాళ్ల రూరల్: అభివృద్ధి అంటే కాగితాల్లో కనిపించకూడదనీ, అభివృద్ధి అంటే చరిత్రలో నిలిచిపోయేలా చేసి చూపాలనీ, అది సీఎం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో జల మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 2.92 కోట్లతో ఈ రోజు ప్రతి ఇంటికీ కృష్ణా జలాలను తీసుకువస్తున్నామని, రాబోయే రోజుల్లో ఏ ఒక్క అక్క చెల్లెమ్మలు బిందెలు పట్టుకుని గడప దాటే పని లేకుండా ఇంటి వద్దకే కృష్ణా జలాలను అందించనున్నామన్నారు. ఆరు నెలల్లో ప్రతి ఇంటికీ మంచినీటిని అందిస్తామని తెలియజేశారు. అనంతరం రూ. 2.15 కోట్ల నిధులతో చేపట్టబోయే మంచినీటి పథకానికి ఎమ్మెల్యే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, సర్పంచ్ బైరపోగు కె. ఏలయ్య, ఉప సర్పంచ్ రాగిడి రాజారావు, ఎంపీటీసీ హస్సాన్‌వలి, మాజీ సర్పంచ్ ముత్యం ఉమా మహేశ్వరరెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ తిప్పిరెడ్డి రామిరెడ్డి, కత్తెరపు రంగారెడ్డి, గున్నం రెడ్డి రమణారెడ్డి, వెన్నా శ్రీనివాస్‌రెడ్డి, అల్లు బాలిరెడ్డి, ప్రింటింగ్ ప్రెస్ సైదా, పేరం వెంకటేశ్వర్లు, పమ్మి శివారెడ్డి, షేక్ హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణ తీరు మార్చుకోవాలి

- నిర్లక్ష్యపు విధులతో విద్యార్థులు చదువు అందుతుందా..!
- అక్షరాస్యతా శాతం పెంచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- పెదకాకాని జెడ్పీ ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం



ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌ప్రకాష్

పెదకాకాని: విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్యను అందించినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి, అక్షరాస్యత శాతం పెంచేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్యపు విధుల కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. తరగతి గదుల్లోని ఐఎఫ్‌బీ బోర్డులపై పాఠాలు బోధించేటపుడు ఎందుకు సేవ్ చేయడం లేదు, విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఐఎఫ్‌బీ బోర్డు మంజూరు చేసినా ఎందుకు అమర్చలేదంటూ ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన బడి నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించినా ఆశించిన ఫలితాలు మాత్రం రావడం లేదన్నారు. పాఠశాల పనితీరు బాగాలేదన్నారు. రాష్ట్రంలో పలు పాఠశాలల్లో విద్యాబోధనలు చక్కగా జరుగుతున్నాయని ఫలితాలు కూడా మంచిగా ఉన్నాయని అక్కడికి ఇక్కడికి తేడా ఏమిటో, ఇలా ఉంటే విద్యార్థులకు చదువు ఎలా అర్థమవుతుందో చెప్పాలన్నారు. విద్యార్థులకు మంచి మార్కులు ఎందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయులు తమ బాధ్యతను అర్థం చేసుకొని పనిచేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతి రోజూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు ఏవిధంగా పాఠాలు బోధిస్తున్నారో గమనించాలని, విద్యార్థులకు ఎంత మేరకు అర్థమవుతుందో తెలుసుకోవాలని సూచించారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

జేసీ ఎ.శ్యామ్ ప్రసాద్

చిలకలూరిపేట టౌన్: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు పథకాల అమలు ప్రక్రియను పరీక్షించి, తగు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.జ్వాలా నరసింహం, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

ఖరీదైన బైక్‌లు దొంగిలించే అంతర్ జిల్లా ముఠా అరెస్టు

- రూ.24 లక్షలు విలువ చేసే 13 బైక్‌లు, 36 సెల్‌ఫోన్లు సీజ్
- వారం రోజుల్లో కేసుని ఛేదించిన నల్లపాడు పోలీసులు

నగరంపాలెం: ఖరీదైన బైక్‌లతో పాటు మొబైల్ దుకాణాల్లో చోరీలకు పాల్పడే దొంగల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. రూ.24 లక్షల ఖరీదు చేసే 13 ద్విచక్ర వాహనాలు, 36 సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ వెల్లడించారు. వారం రోజుల కిందట గుంటూరు నల్లపాడు పీఎస్ పరిధిలోని పెద పలకలూరులో ఓ మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. ఈ క్రమంలో బాధితుని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఎస్పీ (క్రైం), దక్షిణ డీఎస్పీ స్థాయిలో ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు వేగవంతం చేశారు. గోరంట్ల చిల్లీస్ రోడ్ వద్ద శుక్రవారం ఉదయం గుంటూరు రూరల్ మండలం గోరంట్ల వాసి షేక్ అసిఫ్, పొన్నూరు మండలం ఎరుకుపాలేనికి చెందిన జాష్టి వెంకటసాయి, ప్రకాశం జిల్లా గిద్దలూరు ఐదో వార్డుకి చెందిన మైదకూరి హసీబ్, పొన్నూరు మండలం డీవీసీ కాలనీకి చెందిన దేవరకొండ రాజ్‌కుమార్ అలియాస్ భవాని, తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ అలీని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరం రుజువుకావడంతో అయిదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. 13 ద్విచక్ర వాహనాలు, 36 సెల్‌ఫోన్లు, 10 చార్జర్లు, పవర్ బ్యాంక్స్ స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ దుకాణంలో చోరీ కేసుని ఛేదించే క్రమంలో ఈ ముఠా చేస్తున్న చోరీలు ఒక్కొక్కటి వెలుగులోకి వచ్చాయి. గుంటూరు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని కొన్ని పీఎస్‌లలో 14 కేసులు నమోదై ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

నగదు రివార్డులు అందజేత

కేసులో ప్రతిభ కనబరిచిన దక్షిణ డీఎస్పీ ఎం డీ.మహబూబ్ బాషా, సీఐ సీహెచ్.రాంబాబు, ఎస్ఐ డి.అశోక్, హెచ్‌సీలు కె.సుబ్బారావు, పి.ఆదిబాబు, కానిస్టేబుళ్లు షేక్ జాన్‌సైదా, మస్తాన్‌వలి, ఎ.చంద్రమౌళి, ఆర్.ఆంజనేయులను జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు అందించారు. సమావేశంలో శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.